


# డిగ్రీ విలువ అర్థమయింది!

- మెలిశెట్టి శంకరరావు

చదువుతున్న 'చేజ' నవల పక్కను పడేసి బయటకు చూశాను. ఆకాశం ఉదయం నుంచి ఒక్కలా ఏడుస్తూంది. చల్లచల్లగా గాలి. జల్లు జల్లుగా వర్షం. ఉండి ఉండి మెరుపులు. చెట్లు భయం భయంగా కదులుతున్నాయి. అప్పుడప్పుడు విసురుగా తుంపర. ప్రకృతిని చూస్తే భయం వేసింది. నా జీవితం లాగానే ఉంది అస్తవ్యస్తంగా.

ఇంటి పై కప్పు కారుతూంది. అక్కడినుంచి పడుతున్న చినుకులు నా మంచం పక్కనే పడి టప్ టప్‌మని శబ్దం చేస్తున్నాయి.

చిరుగ్గా ఉంది. చిందర వందరగా ఆలోచనలు. కాలేజీలో చదువుతున్న రోజుల్లో జీవితం ఇంత అసహ్యంగా లేదు. మూడు సంవత్సరాల కాలేజీ జీవితం అంతా తియ్యగా చకచకా గడిచిపోయింది. కాలేజీ అయిపోయిన తరువాత మళ్ళీ ఈ పల్లెటూళ్ళోనే పడ్డాను. ఒక సంవత్సరం దొర్లిపోయింది. బాధ్యతలు నెమ్మదిగా మెడకు చుట్టుకుంటున్నాయి. ఉన్న మూడెకరాల పొలం నా డిగ్రీ చేతికి వచ్చేసరికి అర ఎకరంగా మారి కూర్చుంది. వృద్ధాప్యం పైబడుతున్న అమ్మను చూసుకోవలసిన బాధ్యత, చెల్లాయి పెళ్ళి, ఇద్దరు తమ్ముళ్ళను పెంచి పెద్ద చెయ్యటం — అన్నీ నా నెత్తి మీదే పడ్డాయి. సంవత్సరం పాటు ఎలా గడిచిపోయినా, ఇక ఉద్యోగం చూసుకోకపోతే ఇల్లు గడిచే పట్టు లేదు. ఇప్పటికే నెలకు వారం రోజులు పైగా ఇంటిల్లిపాదికీ ఒక్క పూటే భోజనం.

నేను మాత్రం ఏం చెయ్యను? కనిపించిన ప్రతి పనికీ అప్లికేషన్ పడేస్తూనే ఉన్నాను. అప్లికేషన్ పడెయ్యటమే తప్ప ఎవడూ జాలిపడి ఒక ఉద్యోగం పడేసే జాడ ఏమీ కనుచూపు మేరలో కనబడ్డం లేదు.

ఛీ! వెధవ జీవితం! అనవసరంగా వేలు తగలబెట్టి డిగ్రీ చదివాను. ఆ డబ్బుతో కిళ్ళీకొట్టు పెట్టుకున్నా పైకొచ్చేవాణ్ణి.

"అన్నానికి రావేంరా?" అమ్మ కేకతో ఉలిక్కిపడి లేచాను.

* * *

రోజూ ఉదయం పూట లైబ్రరీలో వాంటెడ్ కాలమ్స్ వెదుక్కోవటం, అప్లికేషను వ్రాసుకోవటం, సాయంత్రం కోనేటి పక్కనున్న మెట్ల మీద కూర్చుని చీకటి పడే వేళకు ఇల్లు చేరుకోవటం.. నిస్సారంగా రోజులు దొర్లుతున్నాయి.

మొదట్లో ఉద్యోగానికి సంబంధించిన ప్రకటన చూస్తే చాలు, ఉద్యోగం వచ్చేసినంత ఉత్సాహపడిపోయేవాణ్ణి. ఆ ఉత్సాహంలోనే దూరంకూడా లెక్క చేయకుండా అప్పు చేసి మరీ వరంగల్ బాంకు టెస్టుకు వెళ్ళాను. ఉన్నవి పంథొమ్మిది పోస్టులు. పరీక్ష వ్రాయడానికి వచ్చిన సుమారు నాలుగైదు వేల మందిని చూసేసరికి నీరసం వచ్చేసింది.

పరీక్ష ప్రారంభం కావటానికి ఇంకా గంట పైగుంది. చదవటానికని ఎంతో ఉత్సాహంగా తెచ్చుకున్న పుస్తకాలు పక్కను పడేసి, లాన్‌లో కూర్చుని వచ్చిన వాళ్ళను చూస్తూ ఉన్నాను.

వందలమంది దౌర్భాగ్యులు. అందరి కళ్ళలోనూ ఏదో ఆశ, ఉత్సాహం. ప్రతివాడు పక్కవాణ్ణి శత్రువులాగానే చూస్తున్నాడు. కొంతమంది చెట్ల క్రింద చేరబడి పుస్తకంలో మొహం పెట్టి ఏవో లెక్కలు వేసుకుంటూ పిచ్చివాళ్ళలా తదేకంగా చదివేసుకుంటున్నారు.

వాళ్ళను చూస్తే జాలి వేసింది. పంతొమ్మిది పోస్టులంటే అని ఈ పాటికి ఎవరో అదృష్టవంతులకు కేటాయించబడే ఉంటాయి. అయినా, ఏమిటో వీళ్ళ ఆరాటం? నాకు నవ్వు వచ్చింది. జీవం లేని నవ్వు. ఏడవలేక నవ్వటం. మనసులో నిరుత్సాహంగా ఉంది. కసి, ఈ వ్యవస్థ మీద. అన్య మనస్కంగానే పరీక్ష వ్రాసి బయటపడ్డాను.

ఫలితాలు తెలిశాయి. సెలెక్ట్ కాలేదు. అయినా, ముందు వూహించిందే కాబట్టి పెద్దగా నిరుత్సాహ పడలేదు.

పట్టు వదలని విక్రమార్కుడులా కర్నూలులో బాంకు టెస్ట్, విజయవాడలో రైల్వే సర్వీస్ కమిషన్, విశాఖపట్నంలో స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఇంకా బోలెడు పరీక్షలు చడా మడా వ్రాసేసి కూర్చున్నాను. అయినా, నో హోప్! అప్లయి అప్లయి బట్ నో రిప్లయి! పూర్వం యువరాజులు సింహాసనాన్ని అధిష్ఠించే ముందు దేశ సంచారం చేసేవారట. అలా ఉంది నా పరిస్థితి.

ఒక రోజు లైబ్రరీ నుంచి బయటికి వచ్చి ఇంటికి వెళ్ళుతున్నాను.

"ఏమోయ్! ఖాళీగా తిరక్కపోతే ఏదైనా ఉద్యోగం చూసుకోరాదూ?" గారపళ్ళు ఇకిలించి అడిగాడు కరణం.

ఒళ్ళు మండింది. ఉద్యోగా లేమన్నా చింకి చేటలతో ఎత్తి పెంటకుప్పల మీద పారేస్తున్నారా, ఎత్తేసుకుని తెచ్చేసుకోవడానికి?

'ఉద్యోగం చెయ్యాలండి. అచ్చేసిన ఆంబోతులా వూరి మీద పడి తిరుగుదామని సరదాగా ఉంది' అందామనుకున్నాను. ఉక్రోషం మనసులో అణిచేసుకుని, "ప్రయత్నిస్తున్నానండి" అని చెప్పి ముందుకు నడిచాను.

రోజులు గడుస్తున్న కొద్దీ బ్రతుకంటే విరక్తి పుడుతూంది. 'అసలు ఈ జీవితంలో నేనెందుకయినా పనికొస్తావా?' ఈ ప్రశ్న పదే పదే నా మనస్సులో తేలుకొండిలా తల ఎత్తుతూంది.

అమ్మ, చెల్లాయి, తమ్ముళ్ళ మొహాలు చూడలేక పోతున్నాను. 'నువ్వు అసమర్థుడివి' అని నన్ను వాళ్ళంతా వేలెత్తి చూపిస్తున్నట్టు బాధపడుతున్నాను. ఇదివరకులా ఎవరితోనూ మనసు విప్పి మాట్లాడలేక పోతున్నాను.

■ ■ ■

ఆ సమయంలో దేవుడులా కరుణించారు ప్రెసిడెంట్ రాఘవరావుగారు. ఆయన బంధువు గురవయ్య లంబసింగి దగ్గర గూడెంలో కలప అడితి ఉంటే అక్కడికి వెళ్ళమని చెప్పి ఉత్తరం వ్రాసి ఇచ్చారు.

ఆయనకు నమస్కారం పెట్టి వచ్చేశాను.

* * * *

మరునటి రోజే భద్రాచలం ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాను. లంబసింగి చేరేటప్పటికి మధ్యాహ్నం మూడయింది.

నన్నొక్కణ్ణే వదిలేసి, నా మొహం మీద దుమ్ము రేపుకుంటూ బస్సువెళ్ళి పోయింది. బస్సు కనుమరుగయ్యే వరకు చూస్తూ నిలబడిపోయాను. అక్కడి నుంచి గూడెం పది కిలోమీటర్లు. నెమ్మదిగా కాలిబాట పట్టాను.

దిగంతాల వరకు అరణ్యం పరుచుకొని ఉంది. చుట్టూ కొండలు. వేసవి కాలం కావడం వల్ల చెట్లన్నీ ఎండిపోయి ఉన్నాయి, నా బ్రతుకు లాగే.

సాయంత్రం అవుతుండగా గురవయ్యగారి కలప అడితి చేరుకున్నాను. అక్కడ సుమారు రెండువందల మంది పని చేస్తున్నారు. కొంతమంది చెట్లు కొడుతూంటే, మరి కొంతమంది వాటిని పేర్చి లారీల్లోకి ఎక్కిస్తున్నారు.

గురవయ్యగారు ఎక్కడ ఉంటారో ఒకతన్ని అడిగి అటుకేసి నడిచాను. రెల్లుగడ్డితో నేసిన పాక బయట నులక మంచం మీద పడుకొని చుట్ట కాలుస్తున్నాడతను. సుమారు నలభై ఏళ్ళు ఉంటాయి. సిల్కు పంచె, లాల్చి. మెడలో పులి గోరు వేళ్ళాడుతూంది. కళ్ళు ఎర్రగా ఉన్నాయి.

నమస్కారం పెట్టి నిల్చున్నాను. ఏం కావాలన్నట్టు చూశాడు, ఏం మాట్లాడకుండా.

"నన్ను తమ్మాపురం నుంచి రాఘవరావుగారు పంపారండి." జేబులోంచి ఉత్తరం తీసి అందించాను.

"మా బామ్మర్దిం పేడ?" అతని మొహం నవ్వుతో వికసించింది.

"నాకు సదువు రాదయ్యా! నువ్వే సదివి ఇనిపించు." ఆరిపోయిన చుట్ట వెలిగించుకుంటూ చెప్పాడు.

ఉత్తరం చదివాను. అతని మొహంలో నవ్వు మాయమయింది.

"ఈడిక్కేటి వచ్చేదు. పన్లో ఎట్టుకోమని అందర్నీ నా మీదకి తోల్తాడు. నా నెక్కడెట్టుకునేది? నా నెత్తి మీద! కిందటేడాల్లో ఇద్దర్నంపేడు. మళ్ళీ ఇప్పుడిన్ను." అని చుట్ట పొగ పీల్చి వదిలాడు.

ఆ సమయాన్ని వృథా చేయలేదు నేను. "అలా అనకండి! చాలా కష్టాల్లో ఉన్నా న్నేను." నా గొంతు నాకే అసహ్యంగా ధ్వనించినట్టనిపించింది.

"వూఁ. ఏం సేత్తావు నువ్వు?" పీలగా ఉన్న నన్ను ఎగా దిగా చూస్తూ అడిగాడు.

"మీరేం చెప్పినా చేస్తానండి." ఆత్రతగా అనేశాను.

"సదూకున్నావా?"

"బి. కామ్. చదివానండి."

"అబ్బోసి! పెద్ద సదువే సదివినావు. మర్నాకాడ నువ్వేటి జేత్తావ్!" దర్జాగా చుట్టూ పని చేస్తున్న వాళ్ళను కలియజూస్తూ అడిగాడతను.


నాకు కన్నీళ్ళొక్కటే తక్కువ.

"మీరే దిక్కు. ప్రస్తుతం ఏదో ఒక పనిలో పెట్టండి. కనీసం ఆ కర్రలు లారీకి మోసే పనయినా సరే!" ఉద్వేగంగా అన్నాను. అమ్మ, చెల్లాయి, తమ్ముళ్ళ మొహాలు దీనంగా కనిపిస్తున్నాయి.

ఈయన పనిలేదు, పొమ్మంటాడేమో? భయంతో మనసు పీకుతూంది. ఒంట్లో సన్నగా వణుకు మొదలయింది. చీకటి పడుతూంది. కూలీలందరూ పనులు కట్టి పెట్టేసి వూరివైపు పోతున్నారు.

నేను గురవయ్యగారి మొహంలోకి చూస్తూ నిలబడ్డాను. ఆయన నాకేసి చూడ్డం లేదు. నా మనసు గురవయ్య గారి కాళ్ళు పట్టుకోనా అన్న కోరికతో తహతహలాడి పోతూంది. అయినా అంతరాత్మ అట్టడుగు పొరల్లో ఎక్కడో ఉన్న ఆత్మాభిమానం ఆ కోరిక పీక నొక్కేసింది.

"సర్లేవయ్యా! ఎలగతా కూలీలందరికీ మంచి దూపాయల సొప్పునిత్తన్నాను. నువ్వు



ఫోటో – కె. ఎస్. ఎమ్. రాము
(దొడ్డబళ్ళాపూర్)

సదూకొన్నానంటన్నావు గందా? పద్దు లయ్యా సూత్తా ఉండి మూడున్నర సెప్పున తీస్కో" అనేసి ఆయన లేచి పాకలోకి వెళ్ళిపోయాడు.

పూర్తిగా చీకటి పడిపోయింది.

నా సంచీలో సర్టిఫికేట్లు గురించి తలుచుకుంటే నా కెందుకో నవ్వు వచ్చింది.

నా విశ్వవిద్యాలయం డిగ్రీకి మొట్టమొదటి సారిగా ఒక నిరక్షరాస్యుడు అర్ధరూపాయి 'విలువ' కట్టాడు. ✱